క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నర్మెట: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని బదిలీల ప్రక్రియను వేగవంతం చేయాలని టీఎంఎస్‌టీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జానీ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు ఆదేశాల మేరకు 2023 నూతన సంవత్సర డైరీలు, క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ శరత్ కుమార్, మహేందర్, కిరణ్‌కుమార్ యాదవ్, కట్ట రాజు, నాగేశ్వర్‌రావు ఉన్నారు.

ఇంటర్నల్ మార్కుల నోట్‌బుక్స్ తనిఖీ

లింగాలఘణపురం: మండల పరిధిలోని నెల్లుట్ల ఎస్‌పీఆర్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల నోట్ బుక్స్‌ను మంగళవారం డీఈఓ రాము ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా డీఈఓ రాము పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు అర్జున్, శ్రీధర్, మల్లికార్జున్, రమేష్, నర్సింహులుతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపేందర్, ఏఓ వీరేందర్ పాల్గొన్నారు.

చిత్రాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత

స్టేషన్‌ఘన్‌పూర్: చిత్రాలు వేయడం ఒక కళ అని.. చిత్రాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని ఛాగల్లు సర్పంచ్ పోగుల సారంగపాణి, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్స్ స్టేట్ ప్రెసిడెంట్ కేశవకుమార్ అన్నారు. మండల పరిధిలోని ఛాగల్లు జెడ్పీఎస్ఎస్‌లో చిత్రకళా ప్రదర్శన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మండల నోడల్ అధికారి ఎండీ.అజామోహినొద్దీన్, హెచ్‌ఎం కొమురయ్య, ఉపాధ్యాయులు దేవేందర్‌కౌర్, లీలా, కుమారస్వామి పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రాల అందజేత

చిల్పూరు: చిల్పూరుగుట్ట వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో మార్చి 5నుంచి నిర్వహించే సురమాంభదేవి-కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యే రాజయ్య, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికలను నిర్వాహకులు మంగళవారం అందజేశారు. అలాగే ఎంపీపీ సరితబాలరాజు, చిల్పూరుగుట్ట ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, పల్లా యువసేన అధ్యక్షుడు కేశిరెడ్డి రాకేష్‌రెడ్డికి కూడా ఇచ్చారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మంపేటలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సీడీఎఫ్ నిధుల ద్వారా మంజూరు చేసిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ మంద మల్లేశం మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ప్రభాకర్, రవీందర్ పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

తరిగొప్పుల: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్ కుమార్ గౌడ్ అన్నారు. మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన మాటూరి రామస్వామి కాలి ఇన్ఫెక్షన్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స చేయించుకున్నారు. కాగా, సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.25 వేల చెక్కును మంగళవారం బధితుడికి కిరణ్‌కుమార్ అందజేశారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండలంలోని బసిరెడ్డిపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బండకింది నర్సింహులు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

స్టడీ మెటీరియల్ అందజేత

జనగామ రూరల్: చంద్రగిరి బంగారాం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పెంబర్తిలో విద్యార్థులకు నోట్ బుక్స్, పరీక్షప్యాడ్స్, స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈకార్యక్రమానికి డీఈఓ కె.రాము ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ట్రస్టు సభ్యులు ప్రసాద్, శ్రీనివాస్, సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ రవి ఉన్నారు.

దరఖాస్తుకు నేడు చివరితేదీ

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రవేశాల దరఖాస్తుకు నేడు(బుధవారం) చివరి తేదీ అని పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. మంగళవారం పాఠశాలలో మాట్లాడుతూ 6 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ దేవేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు

బచ్చన్నపేట/లింగాలఘణపురం: గ్రామాల్లో జీవాలకు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందులను నేటి నుంచి 28 వ తేదీ వరకు వేయనున్నట్లు బచ్చన్నపేట, లింగాలఘణపురం మండల పశువైద్యాధికారులు రామారావు, అనిత తెలిపారు. మంగళవారం వారు వేర్వేరుగా మాట్లాడారు. గొర్రెలు, మేకల పెంపకందార్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



జనగామ రూరల్: మాట్లాడుతున్న రాజేష్ కుమార్



దేవరుప్పుల: మాతృభాషాదినోత్సవ ఆకృతిలో విద్యార్థులు



జఫర్‌గఢ్: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. మాతృ భాష తెలుగును రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఏబీపీ డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగాధిపతి ఎస్. రాజేష్ కుమార్ అన్నారు. మంగళవారం మాతృ భాషా దినోత్సవం సందర్భంగా కళాశాలలో తెలుగు, ఆంగ్ల విభాగం ఆధ్వర్యాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ మాతృ భాషను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అవకాశాలు అందిపుచ్చుకోవడంలో నేడు ఇంగ్లిష్‌కు మంచి అవకాశాలు ఉన్నాయని, అలాగే తెలుగుకు కూడా ప్రాధాన్యత కల్పించి ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. తెలుగు మీడియంలో చదువుకునే విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.నర్సయ్య, పి.శైలజ, గజవెల్లి ఈశ్వర్, కలువల శ్రీనివాస్, రవిప్రసాద్, వెంటకట్‌రెడ్డి, రవీంద్ర నాయక్, నళిని, ఎం శ్రీనివాస్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో..

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాసం, తెలుగు హ్యాండ్ రైటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు కట్కూరి మహేందర్, భూక్య నరేష్, జానీనాయక్, కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, మనోజ్, రాజేంద్రప్రసాద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అక్షర మాలతో ప్రశాంతి విద్యార్థుల ప్రదర్శన

దేవరుప్పుల : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ టి.పాండు కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు అక్షరమాలగా ప్రదర్శన చేసి తెలుగు భాష పట్ల తమ ప్రేమను చాటారు.

అభినందనీయం

మాతృభాష విలువలను చాటేందుకు నిరుపేదలకు విద్యార్థుల దాతృత్వం అభినందనీయమని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సజ్జన్‌రావు అన్నారు. మంగళవారం నీర్మాలలో మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థుల మనసుల్లో సంస్కార బీజాలను నాటగలిగే శక్తి కల్పించేందుకు సోమక్క, పాపయ్య అనే నిరుపేద దంపతులకు వస్త్రాలు, గాజులు, తినుబండారాలు, ఇదే పాఠశాల విద్యార్థి దుర్గాప్రసాద్‌కు రెండు జతల దుస్తులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు మల్లారెడ్డి, త్రిపురారి పద్మ, సురేష్‌బాబు, రాధిక, ఎల్లయ్య, అంగన్‌వాడీ టీచర్లు ఉమ, రేణుక,పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దేవరుప్పుల: దుస్తులు పంపిణీ చేస్తున్న విద్యార్థులు



చిల్పూరు: తెలుగు భాషపై ప్రసంగిస్తున్న విద్యార్థి

పల్లగుట్ట పాఠశాలలో..

చిల్పూరు: పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం నర్సిరెడ్డి అధ్యక్షతన తెలుగు ఉపాధ్యాయురాలు మూల లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తెలుగు భాషపై ప్రసంగాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయురాలు కోమలి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్యలో ప్రావీణ్యం పొందాలి



రఘునాథపల్లి: బాలికలు ఆత్మరక్షణ విద్యలో ప్రావీణ్యం పొందాలని బాలికల చైల్డ్ జిల్లా అధికారి (జీసీడీఓ) గౌసియాబేగం సూచించారు. మంగళవారం మండలంలోని ఖిలాషాపూర్ ఉన్నత పాఠశాలలో బాలికలకు నిర్వహిస్తున్న కరాటె శిక్షణను ఆమె సందర్శించారు. సెల్ఫ్ డిఫెన్స్‌లో నేర్చుకుంటున్న మెళకువలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. నెల రోజుల పాటు నిర్వహించనున్న కరాటే శిక్షణ తరగతులను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. హెచ్‌ఎం భగవాన్‌రెడ్డి, కరాటె మాస్టర్ ఓరుగంటి సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుట్టపై మంటలు



చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్టపై రోజూ మాదిరిగానే మంగళవారం సిబ్బంది చెత్తను ఊడ్చి దూరంగా నిప్పు పెట్టారు. అదికాస్తా గాలికి నిప్పు రవ్వలు ఎగిసిపడి గుట్టపై చెట్లను అంటుకోవడంతో మంటలు వ్యాపించాయి. దీంతో రాత్రి 9.30 ప్రాంతంలో అగ్నిగుండంగా గుట్ట కనిపించింది. కాగా, మధ్యాహ్నం గుట్టపై పొగ కనిపించగానే సిబ్బందికి గుట్ట కింది ప్రజలు చెప్పినా ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు.

చుక్క సత్తయ్య స్మారక భవనానికి కృషి



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

లింగాలఘణపురం: మండలంలోని మాణిక్యాపురంలో చుక్క సత్తయ్య స్మారక భవన నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. మంగళవారం మండలంలోని మాణిక్యాపురంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్వేతపూర్ణచందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కళాకారులకు పుట్టినిల్లుగా ఉన్న మాణిక్యాపురం మండలంలో అభివృద్ధిలో కూడా ముందు ఉందని అన్నారు. అదేవిధంగా ఎస్సీలకు దళిత బంధు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు మహిళలు కోలాటాలతో ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ జయశ్రీ, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసు, మంథోనిగూడెం సర్పంచ్ సత్యనారాయణ, నాయకులు చేవెల్లి సంపత్, సానికె మధు, భాగ్యలక్ష్మి, శ్రీహరి, విష్ణు, రవి పాల్గొన్నారు.

రేషన్ షాపు తనిఖీ



తరిగొప్పుల: మండల పరిధిలోని అంకుషాపూర్ గ్రామంలో రేషన్ దుకాణంలో సివిల్ సప్లై అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ఇట్టబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలోని రేషన్ షాపులో డీలర్ జీడికంటి రాజయ్య సరుకులను సక్రమంగా పంపిణీ చేయడం లేదని గ్రామ పంచాయతీ పాలకవర్గం ఫిర్యాదు చేయగా డీఎస్ఓ ఆదేశాల మేరకు షాపును తనిఖీ చేశారు. రేషన్ పంపిణీలో లోటుపాట్లు గుర్తించడం జరిగిందని, నివేదికను ఉన్నతాధికారులు అందజేస్తామన్నారు. ప్రస్తుతం డీలర్ రాజయ్య నడిపిస్తున్న రేషన్ షాపును మరొక డీలర్ నడిగొటు శ్రీధర్‌కి అప్పగించామని తెలిపారు. డీటీ దేవా, సర్పంచ్ ముక్కెర బుచ్చిరాజ్ యాదవ్, ఉపసర్పంచ్ పోగుల చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి రవీందర్, కిరణ్ పాల్గొన్నారు.

సేవా మార్గంలో విద్యార్థులు

- అంధుల సంక్షేమానికి విరాళాలు సేకరించిన ఏకశిల విద్యార్థులు
- రూ.3,21,500 అందజేత



చెక్కు అందజేస్తున్న ఏకశిల పబ్లిక్ స్కూల్ కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, పరుశరాములు

జనగామ: చదువుల్లో, ఆటల్లోనే కాదు సేవామార్గంలోనూ ముందుంటామని నిరూపించారు జిల్లా కేంద్రంలోని ఏకశిల పబ్లిక్ స్కూల్ విద్యార్థులు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో విరాళాల రూపంలో ఏకంగా రూ.3,21,500 సేకరించి అంధుల, అనాథల పునరావస కేంద్రానికి తమవంతు సాయంగా అందజేశారు. ఇటీవల పాఠశాల ప్రాంగణంలో సాంస్కృతిక విభావరి కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం శేరిగూడలోని అంధుల అనాథల పునరావాస కేంద్రం (ఇట్రాడ్) సంస్థకు చెందిన అంధకళాకారులు వివిధ సామాజిక అంశాలపై పాటలు పాడి విద్యార్థులను ఆకర్షించారు. కాగా, ఉపాధ్యాయుల సూచనల మేరకు సేకరించిన రూ.3,21,500 చెక్కును మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, పద్మారెడ్డిలకు ఏకశిల పబ్లిక్ స్కూల్ కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, లయన్స్ ఇంటర్నేషనల్ 320ఎఫ్ జిల్లా గవర్నర్ కన్నా పరుశరాములు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అంధుల అనాథల సేవలో పాతిక సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఇట్రాడ్ సంస్థ నిర్వాహకులను అభినందించారు. చిన్నతనంలోనే విద్యార్థులలో సేవా బీజాన్ని నాటడంపై ఏక శిల విద్యాసంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయులను అభినందించారు.వెయ్యికి పైగా విరాళాలు సేకరించిన విద్యార్థులకు జ్ఞాపికను అందజేశారు. ప్రిన్సిపాల్ ఇందిర, వందన తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

నర్మెట: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేకపోయిన కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని బీజేపీ పార్లమెంట్ కోకన్వీనర్ కొంతం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆగపేటలో శక్తి కేంద్రాల స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని మండల అధ్యక్షుడు ధరావత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మోదీ ఇస్తున్న నిధులతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ తామే చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారని, ఇచ్చిన హామీలను విస్మరించిన ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బానోత్ రామకోటి, గ్రామ శాఖ అధ్యక్షులు జహంగీర్, నాగేష్, సాయినాథ్, ముఖేష్‌రెడ్డి, మోహన్‌భాష, శ్రీనివాస్, రాజు, కిషోర్, సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

గ్రామదేవత విగ్రహాల ప్రతిష్ఠాపన

దేవరుప్పుల: ఈ నెల 26వ తేదీన కోలుకొండలో తలపెట్టిన బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన, శ్రీ దుర్గ మాత ఉత్సవాలను పురస్కరించుకొని ఆయా సామాజిక వర్గాలు గ్రామ దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. మంగళవారం ఆ గ్రామంలో సర్పంచ్ కూర్నాల రవి విరాళంతో ఇచ్చిన ఎల్లమ్మ తల్లి విగ్రహానికి పూజారి బొట్టు ఇంద్రస్వామి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన పూజ జరిపారు. ఈ సందర్భంగా విగ్రహదాత రవితోపాటు ఎంపీటీసీ దామెర రమను ఉత్సవ కమిటీ సత్కరించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

లింగాలఘణపురం: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో టీచర్లు, ఆయాలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీడీపీఓ రమాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని నవాబుపేట అంగన్‌వాడీ కేంద్రంలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, సమయపాలన పాటించాలని, ప్రతి కేంద్రంలో కిచెన్‌గార్డెన్లు ఉండాలని, మెనూ ప్రకారం వంట చేయాలని ఆదేశించారు. సూపర్‌వైజర్లు సావిత్రి, హంసమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ రమాదేవి

ముగిసిన దుర్గామాత ఉత్సవాలు



దుర్గామాతకు పూజలు చేస్తున్న నాయకులు

రఘునాథపల్లి: మండలంలోని ఆంధ్రతండాలో రెండు రోజుల పాటు నిర్వహించిన దుర్గామాత ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. సోమవారం రాత్రి దుర్గామాతకు తండావాసులు ఊరుమ్మడిగా డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. తెల్లవారేదాక ఆలయం వద్ద పూజారులు చెప్పిన కథలకు భక్తులు ముగ్ధులయ్యారు. మంగళవారం ఉదయాన్నే ఆలయం వద్ద గావు పట్టడంతో తండావాసులు కోళ్లు, యాటలు బలిచ్చారు. మధ్యాహ్నం దుర్గామాతకు మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఒడిబియ్యం పోసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు మేకల నరేందర్, కోళ్ల రవిగౌడ్, అల్లిబిల్లి కృష్ణలు దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ బానోత్ బన్‌సూర్య, ఉప సర్పంచ్ వీరన్న, పూజారి బాలాజీ, రాందాసు, హరిసింగ్, సినాద్రి, లింగన్న, కిషన్, హరిసింగ్, కాల్‌రాం, సక్రూ, గణేష్, కిషన్, శ్రీను, చంద్రశేఖర్, బన్యా, తుకారాం, వెంకట్ నాయక్, మాలోతు ఆనంద్, బన్యా, తుకారాం పాల్గొన్నారు.

‘ప్రశ్నిస్తే దాడులు చేయడం హేయమైన చర్య’

దేవరుప్పుల: ప్రభుత్వ వైఫల్యాలపై ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే దాడులు చేయడం హేయమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్ మీద అధికార పార్టీ బీఆర్ఎస్ నాయకుల దాడిని తీవ్రంగా ఖండించారు.

‘తోట పవన్‌పై దాడిని ఖండిస్తున్నాం’

స్టేషన్‌ఘన్‌పూర్: హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్‌పై అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు చింత ఎల్లయ్య, కోరుకొప్పుల మహేందర్, శ్రీను, సంపత్‌రెడ్డి ఉన్నారు.

అవినీతికి కేరాఫ్ బీఆర్ఎస్

పాలకుర్తి: బీఆర్ఎస్ అవినీతి రాజకీయాలకు కేరాఫ్‌గా మారిందని కాంగ్రెస్ యూత్ విభాగం నాయకులు బైరు భార్గవ్, మాదాసు హరీష్ అన్నారు. మంగళవారం వారు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు ఏర్పాటు చేసిన సభలో తమను పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. సోమవారం వరంగల్ నగరంలో ఏర్పాటు చేసిన సభలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు తోట పవన్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. రాజేష్ నాయక్, మహేందర్ రెడ్డి, మహేష్, మహేందర్, గడ్డం బాబు, అనిల్, శ్రీను పాల్గొన్నారు.

ఆధార్‌సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లులో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పోగుల సారంగపాణి అన్నారు. ఛాగల్లులో ఏర్పాటు చేసిన ఆధార్‌సెంటర్‌ను సర్పంచ్ మంగళవారం పరిశీలించి తన ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి అశ్విన్‌రెడ్డి, ఆధార్‌సెంటర్ ఇంఛార్జీ నిహారిక, నాగరాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పోచన్నపేటలో పిచ్చి కుక్కల స్వైర విహారం

బచ్చన్నపేట: పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తూ ఓ విద్యార్థిని గాయపర్చిన సంఘటన మంగళవారం పోచన్నపేటలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన నాల్గో తరగతి విద్యార్థి నీల రమాకాంత్ పాఠశాలకు వెళ్తుండగా ఒక్కసారిగా కుక్కలు వచ్చి కరువగా కాలుకి, చేతులకు గాయాలయ్యాయి. అటుగా వచ్చిన కొందరు కొట్టడంతో కుక్కలు వెళ్లిపోయినాయి. సంబంధిత అధికారులు స్పందించి పిచ్చికుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నివాళి

పాలకుర్తి: మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త భోనగిరి సాగర్ మాతృమూర్తి బోనగిరి విజయలక్ష్మి (80) మంగళవారం మృతి చెందింది. కాగా, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి మృతురాలి భౌతికకాయానికి పూల మాల వేసి నివాళులర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు అనుముల మల్లారెడ్డి, చిలువేరు పెంటయ్య, హరీష్, భార్గవ్, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పల్లె ప్రజలకు ఉచిత కంటివెలుగులు

దేవరుప్పుల: తెలంగాణ ప్రభుత్వం పల్లె ప్రజలకు ఉచిత కంటి వెలుగులు ప్రసాదిస్తుందని వైస్ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం కామారెడ్డిగూడెంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. డాక్టర్ అనిల్‌కుమార్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రవి, చింత రవి, సంపత్, బొబ్బిలి, భాగ్య, ఎఎన్ఎం వసంత పాల్గొన్నారు.

పరామర్శ

తరిగొప్పుల: బొంతగట్టునాగారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు ఆకుల తిరుపతి అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. కాగా, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి జగన్‌మోహన్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులను మంగళవారం పరామర్శించి మృతదేహానికి నివాళులర్పించారు.

ఎన్నిక



వెంకటయ్య, అధ్యక్షుడు

రఘునాథపల్లి: మండలంలోని గొర్రెలు, మేకల పెంపకం దారులు మంగళవారం మండల కేంద్రంలోని సమావేశమై నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా కార్యదర్శి సాదం రమేష్ సమక్షంలో జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా రఘునాథపల్లి గ్రామానికి చెందిన గుండా వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు కావటి యాదగిరి, కార్యదర్శి గద్ద రాజు, ఉపాధ్యక్షుడు బాలబోయిన శ్రీనివాస్, గాజుల రామయ్య, సహాయ కార్యదర్శులు మాయ రాములు, కేమిడి వీరస్వామి, కోశాధికారి మరాతి జంపయ్య, సభ్యులుగా బడితె బీరయ్య, బండి రాజు, ప్రభాకర్, చంద్రశేఖర్, శ్రీనులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

బచ్చన్నపేట: గ్రామ పంచాయతీల్లో జమ, ఖర్చుల వివరాల రికార్డుల నిర్వాహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి వన నర్సరీలను పరిశీలించారు. అలాగే చిన్నరామన్ చర్లలో అంగన్ వాడీ కేంద్రాన్ని, బండనాగారంలో జీపీ రికార్డులను పరిశీలించారు.

స్వయంపరిపాలన దినోత్సవం

దేవరుప్పుల/జనగామ రూరల్ : దేవరుప్పుల మండలంలోని పెద్దమడూరు, జనగామ మండలంలోని సిద్దెంకి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల హెచ్‌ఎంలు జలజ, పర్షియా, ఎస్ఎంసీ చైర్మన్లు బబ్బూరి బాలరాజు, లత ఉపాధ్యాయులు, సర్పంచ్ నిర్మల పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బచ్చన్నపేట: అన్నదాతలు పంటల్లో సస్య రక్షణ చర్యలను చేపట్టాలని మండల వ్యవసాయాధికారి విద్యాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బండనాగారంలో పర్యటించి రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో పంటలను, ఆయిల్ పామ్ సాగును పరిశీలించారు. అనంతరం పంటల రక్షణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు.

ప్రాణ రక్షణకు రక్తదానం చేయండి

రఘునాథపల్లి: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఆయువు పోసేందుకు యువత రక్తదానం చేయాలని జిల్లా జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు బొల్లం అజయ్ సూచించారు. లింగాలఘణపురం జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా మండలంలోని వెల్దిలో వంశన్న యువ సేన ఆధ్వర్యాన మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విజయ్, సింగిరెడ్డి తిరుమల్‌రెడ్డి, పెద్దగోని రాజు, పెద్దగోని హరీష్, దుబ్బాక హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జెడ్పీటీసీ జన్మదిన వేడుకలు

లింగాలఘణపురం: జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరిపారు. కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంచారు. విద్యార్థులు పండ్లు పంపిణీ చేశారు. నాగేందర్, రాజు, భాగ్యలక్ష్మి, ఎంపీటీసీలు రాజిరెడ్డి, సిద్దులు పాల్గొన్నారు.

వ్యక్తుల అరెస్టు

పాలకుర్తి టౌన్: భూమి విక్రయించి తిరిగి కబ్జాకు పాల్పడిన పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన కత్తుల మురళి అతని కుమారుడు కత్తుల రామచందర్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై తాళ్ల శ్రీకాంత్ తెలిపారు. పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన కత్తుల మురళి, అతని కుమారుడు గత ఎనిమిది సంవత్సరాల క్రితం దర్దేపల్లి రోడ్డులో శివం గార్డెన్ ముందు ఉన్న ఓపెన్ ప్లాట్‌లను స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాలకు చెందిన ఇమ్మడి ప్రసాద్, దర్దేపల్లికి చెందిన ముస్కు యాకయ్య అనే వ్యక్తులకు విక్రయించారు. ఇప్పుడు తిరిగి అమ్మలని వారిని గతకొంత కాలంగా భయభ్రాంతులకు గురి చేస్తూ గుర్తు తెలియని రౌడీలను తీసుకొచ్చి బెదిరించారని చెప్పారు. అంతేకాకుండా విక్రయించిన భూమిని అక్రమించుకొని ప్రహరీ నిర్మించారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా భూమి విక్రయించిన దస్తావేజులు, రికార్డులు పరిశీలించి మురళి, రామచందర్ నేరానికి పాల్పడినట్లు రుజువు కావడంతో అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి.సత్యం (S.R) : 8008671692 (పాలకుర్తి)
యం.డి. ఖలీల్ (S.R) : 8179719313 (జనగామ)
జి. రవియాదవ్ (A.C.O) : 9032782191